బాలాజీరెడ్డికి ఎంపీ నివాళి



కుప్పస్వామిరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ గురుమూర్తి

నారాయణవనం: మండలంలోని పాలమంగళం దక్షిణపు కండ్రిగకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుప్పస్వామిరెడ్డి, సర్పంచ్ ప్రేమలత దంపతుల కుమారుడు బాలాజీరెడ్డి(38) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి అక్కడికి చేరుకుని బాలాజీ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ ప్రేమలత, కుప్పారెడ్డిలను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రేణిగుంట/ఏర్పేడు: ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రేణిగుంటలో ఎంఈవో ఇందిరా దేవి చేతుల మీదుగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఏర్పేడులో సీఐ శ్రీకాంత్, ఎస్ఐ శ్రీకాంత్ చేతుల మీదుగా బాల కార్మిక పోస్టర్లను ఆవిష్కరించారు.

బాల్యవివాహాల నిర్మూలన మన బాధ్యత



మహిళలతో సమావేశమైన అధికారులు

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత అని సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. మండలంలోని యం.డి పుత్తూరు గ్రామంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రజుమం నిర్వహించారు. సర్పంచ్ మోహన ప్రియ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

నాగలాపురం: బాల్య వివాహాలను పోత్సహించడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం కిశోరి వికాసం వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా, ఉప సర్పంచ్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, విజయ లక్ష్మి, కానిస్టేబల్ ఉదయ్, ఎంఎస్‌కే శ్వేత పాల్గొన్నారు.

‘సాక్షి’పై దాడి అమానుషం



నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం/బుచ్చినాయుడుకండ్రిగ: నిరసనల ముసుగులో టీడీపీ నాయకులు సాక్షి కార్యాలయాలపై దాడులకు తెగబడడం అమానుషమని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తోపాటు ఆ పార్టీ బీఎన్ కండ్రిగ మండల కన్వీనరు కొణతనేని మణినాయుడు అన్నారు. మంగళవారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. టీవీ చర్చా వేదికలో ఎవరో అన్న మాటలను సాక్షి మీడియాకు ఆపాదించి, ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు ఇలా దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పిదాలను సాక్షి ప్రశ్నిస్తోందన్న అక్కసుతో కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. సంబంధం లేని విషయాన్ని సాకుగా చూపి సాక్షిపై దాడులకు పాల్పడతున్నారని చెప్పారు.

తుడా లేఔట్ పరిశీలన

రేణిగుంట: మండలంలోని సూరప్పకశంలో ఉన్న పద్మావతి నగర్ తుడా లేఔట్‌ను మంగళవారం తుడా అధికారులతో కలిసి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పరిశీలించారు. అధికారులు లేఅవుట్ ప్లానింగ్ ను వివరించారు. వీలైనంత త్వరగా అటవీ అనుమతులు తీసుకుని మిగిలిన ప్లాట్లను వేలం వేయాలని తుడా చైర్మన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ సుజన, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవి కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరోనాపై అప్రమత్తత అవసరం

బుచ్చినాయుడుకండ్రిగ: కరోనా మళ్లీ విజృంభిస్తుండడంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో దీనికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి, వాల్ పోస్టర్లను అంటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు భౌతిక దూరం పాటించేలా, శానిటైజర్ వాడేలా, మాస్కులు ధరించేలా చూడాలని తెలిపారు. కరోనా లక్షణాలుంటే వెంటనే టెస్టులు చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టె బిల్లు రాలేదని ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్తపాళెం గ్రామంలో మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నీటి తొట్టెకు సంబంధించిన బిల్లు నగదు రాలేదని మంగళవారం సర్పంచ్ భర్త హరిప్రసాద్ ఎంపీడీఓ వెంకటరత్నమ్మకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి తొట్టెను నిర్మించి మూడు నెలలు కావస్తున్నా నగదు చెల్లించలేదని వాపోయారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ వెంకటరత్నమ్మ మాట్లాడుతూ ఏపీఓతో మాట్లాడి బిల్లు నగదు త్వరగా వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పేదలకు ఇంటి స్థలాలు కేటాయించండి

నారాయణవనం: మండలంలోని డీకే పాళ్యం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇంటి స్థలాలను కేటాయించాలని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి, బీఎస్పీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి ధనుంజయులు డిమాండ్ చేశారు. వారు మంగళవారం డీకే పాళ్యం వాసులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ గ్రామానికి సమీపంలోని బీడు ప్రాంతం స్థానిక ప్రైవేట్ కళాశాల యాజమాన్యం స్వాధీనంలో ఉందని అన్నారు. బీడు స్థలాలను రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకుని గ్రామంలో ఇళ్లు లేని దళితులకు పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే సుమారు 24 ఏళ్ల క్రితం ఇంజనీరింగ్ కళాశాల పేరున రిజిస్టరైన పట్టా భూములను నేడు అధికారులు ప్రభుత్వ భూమిగా పేర్కొనడం అన్యాయమని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

సత్యవేడు జాతర వైభవం

సత్యవేడులో గంగమ్మ జాతర సందడి మొదలైంది. తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర తరువాత ఇక్కడ జాతరకు అంతటి ప్రాచుర్యం ఉంది. 115 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. బుధవారం రాత్రి చాకలి వారి ఇంటి నుంచి ఊరేగింపుగా బయల్దేరి గురువారం తెల్లవారు జామున నడివీధి గంగమ్మ పర్ణశాలలో కొలువుదీరనుంది. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సత్యవేడుకు చేరుకోవడం ఆనవాయితీ. పర్ణశాల వద్ద విద్యుద్దీపాలంకరణలు, భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, వేపచీర మొక్కులు చెల్లించే మహిళా భక్తులకు ప్రత్యేక స్నానం గదులు ఏర్పాటు చేశారు.

- నేడు, రేపు గంగమ్మ జాతర
- భిన్న సంస్కృతుల సమ్మేళనం

సత్యవేడు: ఆంధ్రా– తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు గంగ జాతరకు సిద్ధమైంది. గంగమ్మ కొలువుదీరే ప్రాంతంలో జాతర నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి 9 గంటలకు పైగా గ్రామ చాకలి ఇంట గంగమ్మ రూపాన్ని బంక మట్టితో కుమ్మరి ప్రత్యేకంగా మహిషాసురమర్దినిగా విశేషపూల అలంకరణ చేస్తారు. గురువారం తెల్లవారు జామున గాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక పర్ణశాలలో అమ్మవారిని కొలువు దీర్చనున్నారు. సంప్రదాయ పూజలు అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తారు.

పంటలు బాగా పండుతాయి

ఏటా జాతర నిర్వహించడంతో పంటలు బాగా పండుతాయనేది ఇక్కడి వారి విశ్వాసం. నడివీధి గంగమ్మకు పర్ణశాలను వేపాకుతో నిర్మిస్తారు. జాతర పూర్తయిన వెంటనే పర్ణశాలను తొలగిస్తారు. రైతులు పర్ణశాలకు వాడిన వేపాకును తీసుకుపోయి తమ పొలాల్లో చల్లుతారు. ఇలా చేయడంతో చీడ పీడలు తొలగిపోతాయనేది రైతుల నమ్మకం.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు (ఫైల్)

మొక్కుల చెల్లింపు

గంగ జాతరకు స్థానిక యువత పేరంటాళ్ల వేషధారణలో అమ్మవారికి తొలి మొక్కులు చెల్లిస్తుంటారు. ఎన్నో ఏళ్ల క్రిందట మాతంగి రుషి ఈ ప్రాంతంలో ఆశ్రమం ఏర్పాటు చేశారు. నిత్యం శివనామ స్మరణతో గడుపుతుండేవారు. అనతి కాలంలోనే అక్కడికి సమీపంలో ఆయన మాతంగేశ్వరాలయాన్ని నిర్మించారు. ఆశ్రమానికి సమీపంలో ఓ చిన్న గ్రామం ఏర్పడింది. అక్కడి ప్రజలు విలాసాలు రోజు రోజుకూ మితిమీరాయి. స్త్రీలు మాతంగి రుషిని తమ కష్టాలు తొలగించాలని వేడుకొన్నారు. దుష్టబుద్ధి కలవారని కట్టడి చేసేందుకు గ్రామ నడిబొడ్డులో శ్రీచక్ర శక్తి పీఠాన్ని ప్రతిష్ఠించి, నిత్యపూజలు ప్రారంభించారు. అప్పటినుంచి యువకులు పేరంటాళ్ల వేషం వేయడం ఆనవాయితీ. శ్రీచక్ర శక్తి పీఠం వద్ద అమ్మవారి ప్రతిష్ఠ జరిగిన తర్వాత ఈ గ్రామానికి శక్తివీడుగా మాతంగి రుషి నామకరణం చేశారు. ఈ పదం తమిళభాషలోనిది. తమిళంలో శక్తి అంటే అమ్మవారు అని, వీడు అంటే ఇళ్లు అని అర్థం. అది కాలగమనంలో సత్తివీడుగా మారి నేడు సత్యవేడుగా ప్రాచుర్యంలోకి వచ్చింది.



గంగమ్మ పర్ణశాల వద్ద చలువ పందిళ్లు



అమ్మవారి ఆభరణాలు

ఆరోగ్యకరమైన జీవనానికి యోగా

ఏర్పేడు: ఆరోగ్యకరమైన జీవనానికి యోగా చక్కటి మార్గమని యం.డి పుత్తూరు సర్పంచ్ మోహన ప్రియ అన్నారు. గ్రామంలో సచివాలయ సిబ్బంది సోమవారం సాయంత్రం యోగాంధ్ర పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి భువనేశ్వరి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు వేగవంతం

నాగలాపురం/వరదయ్యపాళెం: సురుటుపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ శభంబన్సల్ పేర్కొన్నారు. రహదారి ప్రాంతాన్ని జేసీ మంగళవారం ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి సందర్శించారు. అంతకుముందు పిచ్చాటూరు జలాశయాన్ని పరిశీలించారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం జేసీకి వినతి పత్రాన్ని అందజేశారు. వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ, ఇందిరానగర్ పంచాయతీలలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి చొరవ చూపాలని ఎమ్మెల్యే కోరారు.

రేణిగుంటలో సీఐటీయూ ధర్నా

రేణిగుంట: విశాఖ స్టీల్ ప్లాంట్ సంస్థలో కార్మికులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు మంగళవారం సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 3 వేల మందిని తొలగించారని అన్నారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు సెల్వరాజ్, కార్యదర్శి హరినాథ్, సీనియర్ నాయకులు వెంకటరమణ, రాజశేఖర్, దీప, దిలీప్ భాషా, కుప్పస్వామి, కష్ణ, చిరాలయ్య, దస్తగిరి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఈవోకు వినతి

శ్రీకాళహస్తి: భక్తులకోసం శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున కల్యాణ మండపాలు నిర్మించాలని మాజీ పాలకమండలి సభ్యుడు అత్తింజేరి బాలాజీ ఏఈవో కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.